4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
గురువారం 25 జూలై 2024
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## తెలంగాణపై ఆర్థిక వివక్ష

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొత్తం మీద 'హళ్లికి హళ్లి సున్నకు సున్న' దక్కింది. గత పదేండ్లుగా చూపుతూ వచ్చిన నిర్లక్ష్యమే మరోసారి వ్యక్తమైంది. ఇదొక ధోరణిగా మారింది. సుమారు గంటన్నర పాటు సాగిన ఆర్థిక మంత్రి ప్రసంగంలో కనీసం ఒక్కసారైనా తెలంగాణ పేరు వినపడలేదు. దేశ ఆర్థిక వ్యవస్థకు అండదండలు అందించడంలో ముందున్న తెలంగాణను ఎందుకనో కావాలనే వెనుకకు నెడుతున్నట్టు కనిపిస్తున్నది. అయినా ఈ అన్యాయంపై రెండు జాతీయ పార్టీల తరఫున ఎనిమిదేసి చొప్పున తెలంగాణ నుంచి గెలిచిన 16 మంది సభ్యులు లోక్‌సభలో గొంతు విప్పలేదు. బయటా నోరెత్తలేదు. అందులో ఇద్దరు కేంద్రమంత్రులు కూడా ఉన్నారనేది గుర్తుంచుకోవాలి. బీజేపీకి పోయినసారి కన్నా రెట్టింపు సభ్యులను ఇచ్చినా మొండిచెయ్యే దిక్కంటే ఏమనుకోవాలి. బీజేపీకి తెలంగాణపై ఎందుకీ వివక్ష? చిన్న రాష్ర్టాల సమర్థకురాలినని చెప్పుకొనే ఆ పార్టీకి కొత్తగా ఏర్పాటైన తెలంగాణపై ఎందుకింత చిన్నచూపు? స్వాభిమాన కేతనమై రెపరెపలాడినందు కా? సత్వరమే సమున్నత సమృద్ధి సాధించినందు కా? పదేండ్లలో దేశానికి అన్నపూర్ణగా నిలిచినందుకా?

కేంద్రానికి పన్నుల రూపంలో తెలంగాణ చెల్లించినదానిలో సగం కూడా రాష్ర్టానికి తిరిగి కేంద్రం ఇవ్వడం లేదు. తెలంగాణ మీద బీజేపీకి, ఆ పార్టీ పెద్దలకు లోతైన ద్వేషం ఏదో లేకపోతే ఇలా ఎందుకు జరుగుతుందనే అనుమానం రాక మానదు. ఒక్క ఓటు రెండు రాష్ర్టాలు అని ఊరించి ఆపై ముఖం చాటేసిన చరిత్ర బీజేపీకి ఉంది. హైదరాబాద్ వంటి రాజధాని ఉన్న ప్రాంతానికి రాష్ట్రం ఎందుకు? అని ఆనాడు ఎల్‌కే అద్వానీ అన్నా.. ఈనాడు తల్లిని చంపి పిల్లను బతికించారని ప్రధాని మోదీ అంటున్నా.. సారం ఒకటే. విభజన చట్టం ప్రకారం అన్నదమ్ముల్లో ఒకరికి ఇచ్చి రెండోవానికి ఇవ్వకపోవడం ఏం న్యాయం? అయినవారికి ఆకుల్లో, కానివారికి కంచాల్లో వడ్డించేందుకే ఏటా బడ్జెట్ ప్రవేశపెడుతున్నట్టు అనిపిస్తున్నది. ఏపీకి అధిక నిధులు ఇస్తే తప్పు లేదు. పోలవరానికి నిధులిస్తే దేశానికి ఆహార భద్రత ఏర్పడుతుందని ఆర్థికమంత్రి చెప్పుకొచ్చారు. మరి దేశంలోనే అత్యధిక ధాన్యం పండించిన తెలంగాణ ఏం పాపం చేసిందో మంత్రిగారు చెప్పలేదు.

ఏపీతోపాటు బీహార్‌కూ పెద్దపీట వేయడం వల్ల నష్టం లేదు. అది వారివారి అవసరాలను బట్టి, సంకీర్ణ ఒత్తిళ్ల కారణంగా జరిగి ఉండొచ్చు. కానీ, తెలంగాణకు నిధులు ఎందుకు కేటాయించడం లేదో కేంద్రం సెలవిస్తుందా? జాతీయ పార్టీల ఎంపీలకు అధిష్ఠానాల ముందు మోకరిల్లడం తప్ప మరేమీ తెలియదు. వారికి ఢిల్లీ ప్రయోజనాలే ముఖ్యం. గల్లీ ప్రయోజనాలు పట్టవు. ఇక్కడి ప్రజల ఆశలూ, ఆకాంక్షలూ తలకెక్కవు. మోసపోయి గోసపడుతున్న ప్రజలకు ఇంటిపార్టీ ఎంత అవసరమో, ఢిల్లీలో ఇంటి పార్టీ లేకపోవడం వల్ల ఎంత నష్టమో ఇప్పుడు బాగా స్పష్టమైపోయింది. బరిగీసి, నిలదీసి కొట్లాడితే కానీ నిధులు రావు. ఆ పని బీఆర్‌ఎస్ వంటి స్వాభిమాన పక్షంతో తప్ప జాతీయ పార్టీలతో సాధ్యం కాదు.

# హరీశ్ సవాల్.. రేవంత్ సెల్ఫ్‌గోల్



తెలంగాణ విజయ్

అధికారం కోసమో, ఆధిపత్యం కోసమో అబద్ధాలాడేందుకు వెనుకాడట్లేదు నేటి పాలకులు. గొప్పల కోసం అలవికాని హామీలు, అబద్ధపు వాగ్దానాలతో గద్దెనెక్కి తీరా అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేస్తున్నారు. 'వినాశకాలే విపరీత బుద్ధి' అన్నట్టుగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ సర్కార్ తీరును చూస్తుంటే పురాణాల్లోని ఒక సంఘటన యాదికొస్తున్నది. భస్మాసురుడు అనే రాక్షసుడు శివభక్తుడు. శివుడి మెప్పు కోసం అతను చాలా కాలం పాటు తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చిన శివుడు ప్రత్యక్షమయ్యాడు. ఏం వరం కావాలో కోరుకోమని చెప్పాడు. దీంతో అతను 'తాను ఎవరి తలపై చేయిపెడితే వారు బూడిదైపోయే' వరాన్ని ప్రసాదించాలని శివుడిని కోరుకుంటాడు. అందుకు సమ్మతించిన శివుడు అతను కోరుకున్నట్టే వరం ప్రసాదిస్తాడు. అయితే 'వినాశకాలే విపరీత బుద్ధి' అన్నట్టుగా భస్మాసురుడు వరమిచ్చిన శివుడి తలపైనే చెయ్యి పెట్టాలని ప్రయత్నిస్తాడు. దీంతో విష్ణుమూర్తి సహాయాన్ని శివుడు కోరుతాడు. మారువేషంలో ఆ రాక్షసుడి వద్దకు వెళ్లిన విష్ణువు అతని తలపైనే చెయ్యి పెట్టుకునేలా చేస్తాడు. దీంతో భస్మాసురుడు అంతమైపోతాడు.

అచ్చం ఇలాంటి ఘటన కలియుగంలోనూ జరిగిందంటే నమ్ముతారా? తప్పదు, నమ్మాల్సిందే. మాజీ మంత్రి హరీశ్‌రావు గీసిన పద్మవ్యూహంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిక్కుకున్నది. అలవికాని అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పరిపాలన చేతకాక ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీపై బురదజల్లడంపైనే దృష్టిపెట్టింది. ప్రజలు నష్టపోతున్నారని భావించిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు.. సీఎం రేవంత్‌కు సవాల్ విసిరారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు, 13 హామీలతో పాటు రూ.2 లక్షల రుణమాఫీని ఒకేసారి పూర్తిచేస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా'నని ప్రకటించారు. రాజీనామా లేఖను సైతం సిద్ధం చేసుకున్నారు.

ఇక్కడే అసలు కథ మొదలైంది. ఆలోచన తక్కువ, ఆవేశం ఎక్కువున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆగమాగమైపోయి హరీశ్‌రావు ట్రాప్‌లో పడ్డారు. 6 గ్యారంటీలు, 13 హామీలను మర్చిపోయి, వాటికి సమకూర్చాల్సిన నిధులను దారి మళ్లించి.. రైతు రుణమాఫీ చేస్తానని ప్రతిసవాల్ విసిరారు. ఇటీవల రూ.6,098 కోట్ల నిధులను విడుదల చేసి సంబురాలు చేసుకున్నారు. రుణమాఫీ పూర్తయిపోయిందంటూ 'హరీశ్‌రావు రాజీనామా చెయ్' అని రేవంత్‌తో పాటు కాంగ్రెస్ శ్రేణులు మాట్లాడుతున్నారు. కానీ, అసలు హరీశ్‌రావు విసిరిన సవాల్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ మాఫీ పూర్తి చేస్తే కదా ఆయన రాజీనామా చేయడానికి? హరీశ్‌రావు సవాల్ కారణంగానే కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు, 13 హామీలను ఇప్పుడు అమలుచేయక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. అది సాధ్యం కావాలంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరిస్తుందా? అంటే చెప్పలేని పరిస్థితి. హరీశ్‌రావు సవాల్ కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇరకాటంలో పడిపోయింది. దాంతో రుణమాఫీ అస్తవ్యస్తంగా మారిపోయింది. భస్మాసురుడు తన తలపై తాను చేయిపెట్టి అంతమైనట్టుగా.. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తన గొయ్యిని తానే తవ్వుకున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.



హరీశ్ గీసిన ఉచ్చులో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చిక్కుకున్నది. ఇప్పుడు ఆ పార్టీ పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా తయారైంది. హరీశ్‌రావు సవాల్ విసిరినప్పుడు అందులో ఏ మర్మం దాగున్నదోనని రేవంత్ రెడ్డి ఒక్కసారైనా ఆలోచించారా? హరీశ్‌రావు సుదీర్ఘ అనుభవం కల నాయకుడు. కేసీఆర్ నాయకత్వంలో రాటుదేలిన వ్యక్తి. ప్రత్యర్థి ఎత్తులను చిత్తు చేయటంలో ఆయన దిట్ట. తెలంగాణ ట్రబుల్ షూటర్‌గా ఆయనకు పేరున్నది. అంతకు మించి అతను రాష్ట్ర ఆర్థికమంత్రిగా పనిచేసిన వ్యక్తి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్షుణ్నంగా తెలిసిన వ్యక్తి. ఆర్థిక వ్యవహారాలను, పథకాల సాధ్యాసాధ్యాలను దగ్గర్నుంచి చూసిన వ్యక్తి. అతను సవాల్ విసురుతున్నాడంటే ఎంత ఆచితూచి ఆలోచించి విసురుతాడో అర్థం చేసుకోవాల్సిన సీఎం రేవంత్ అత్యుత్సాహానికి పోయి బొక్కబోర్లా పడ్డారు.

కాంగ్రెస్‌ను తన ట్రాప్‌లో పడేయడంలో హరీశ్ విజయవంతమయ్యారని ఘంటాపథంగా చెప్పవచ్చు. హరీశ్ విసిరిన సవాల్ వెనకున్న ఆంతర్యం అర్థం కాక రేవంత్‌రెడ్డి కనపడ్డ దేవుని మీదల్లా ప్రమాణాలు చేస్తూపోయారు. నిజానికి రేవంత్ ప్రభుత్వం రైతు రుణమాఫీ పూర్తి చేయాలంటే సుమారుగా రూ.40-50 వేల కోట్లు అవసరం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొదటి దఫా రూ.లక్షలోపు మాఫీ కోసం రూ.19 వేల కోట్ల నిధులను కేటాయించింది. కానీ, నేడు రేవంత్ ప్రభుత్వం రూ.6,098 కోట్ల నిధులను మాత్రమే రూ.లక్షలోపు రుణమాఫీ కోసం విడుదల చేసినట్టు ప్రకటించింది. అసలు విడుదల చేసిందెంతో, ఎంతమంది ఖాతాల్లో నగదు జమ అయిందో ఇప్పటికీ స్పష్టత లేదు. మరీ అంత తక్కువ నిధులతో రూ.లక్షలోపు రుణమాఫీ ఎలా సాధ్యమవుతుంది? అసలు రేవంత్ రెడ్డికి ఏ ఆర్థిక నిపుణుడు ఈ సలహా ఇచ్చారో?

దీని ప్రభావం రానున్న రెండు నెలల్లో రాష్ట్రంపై పడనున్నది. కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్ల వంటి సంక్షేమ పథకాలకు పంగనామాలు పెట్టి, ఇతర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించకపోవడంతో ప్రజలు రోడ్ల మీదకు వచ్చే పరిస్థితి తలెత్తుతున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. నిర్మాణ రంగం స్తంభించింది. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన నిర్మాణరంగ కార్మికులు స్వస్థలాలకు తిరిగి వెళ్తున్నారు. సాగుకు సరిగా కరెంట్ ఇవ్వటం లేదు. యాసంగిలో నీళ్లివ్వకపోవడంతో పంటలు ఎండిపోయాయి. బోనస్ కాస్త బోగస్‌గా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని చేష్టల వల్ల రాష్ట్ర రైతాంగం, సామాన్య ప్రజానీకం విలవిలలాడుతున్నారు.

పరిపాలనా నైపుణ్యం, పథకాల అమలు సాధ్యాసాధ్యాలపై మాజీ మంత్రి హరీశ్‌రావుకు సుదీర్ఘ అనుభవం ఉన్నది. ఆ అవగాహనతోనే ఆయన సవాల్ విసిరారు. హరీశ్ సవాల్‌ను ఆవేశంతో స్వీకరించిన రేవంత్ ఆయన ట్రాప్‌లో పడ్డారు. ఇలాంటి ఒక అనివార్య పరిస్థితిని హరీశ్‌రావు కల్పించినప్పటికీ 6 గ్యారంటీల అమలు, 13 హామీల అమలు, సంపూర్ణ రుణమాఫీ చేయటం అసాధ్యమని ఆర్థికరంగ నిపుణులు అంటున్నారు. హరీశ్ సవాల్ విషయంలో రేవంత్ రెడ్డి తొందరపడ్డారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెవులు కొరుక్కుంటున్నారు. ఏదేమైనా ప్రత్యర్థుల ఎత్తులను చిత్తుచేయటంలో దిట్ట అయిన ట్రబుల్ షూటర్ మరోమారు తన మార్క్‌ను చాటుకొని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టారని ప్రజలు, రైతులు చర్చించుకుంటున్నారు.



# లిక్కర్ కేసు.. ఓ గాలి కథ

**పాడ్‌కాస్టర్ సిద్ధార్థ ఇంటర్వ్యూలో సీనియర్ న్యాయవాది తన్వీర్ అహ్మద్ మీర్**

**'ఢిల్లీ లిక్కర్ పాలసీ అసలు కేసే కాదు, అది దర్యాప్తు సంస్థలు అల్లిన కేసు' అని ఈ కేసుతో మొదటినుంచీ సంబంధమున్న సీనియర్ న్యాయవాది తన్వీర్ అహ్మద్ మీర్ చెప్పారు. మన దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐలు కేసు నమోదు కాకముందే, దర్యాప్తు పూర్తి కాకముందే ఒక నిర్ధారణ వస్తాయని, ఆ తర్వాత దాని చుట్టూ సాక్ష్యాలు అల్లుకుపోతాయని ఆయన పేర్కొన్నారు. అందువల్ల ఆ కేసు నిలబడదని, అందుకే ఇప్పటికీ విచారణ మొదలుపెట్టడం లేదని, పాడ్‌కాస్టర్ సిద్ధార్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ ఇంటర్వ్యూ సారాంశం...**

అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో సీబీఐ మొదటగా ఎంగేజ్ చేసి, ఆ తర్వాత బ్లాక్ చేయబడిన న్యాయవాదిని నేను. సీబీఐ ఎఫ్‌ఐఆర్ కూడా నమోదు చేయకముందే నన్ను ఎంగేజ్ చేసుకుంది. ఈ కేసును పరిశీలిస్తే.. మనకు ఓ పెద్ద ఎత్తుగడ కనిపిస్తుంది. ఇందులో ఏమైందంటే నిందితుల్లోనే ఒకరిని తీసుకుని సాక్షిగా మార్చేశారు. మరి ఆ నిందితునికి క్షమాభిక్ష ఎవరు పెట్టారు? 'చూడు నిన్ను వదిలిపెడతాం.. నువ్వు మిగిలినవారికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్తావా?' అనే ప్రాతిపదికన క్షమాభిక్ష మంజూరు చేశారా?

నిన్న నేను ఎక్స్ (ట్విట్టర్)లో ఓ ట్వీట్ చేశాను. కింది కోర్టులో బెయిల్ లభించడం, దానిపై హైకోర్టులో ఎదురుదెబ్బ తగలడంపై అదనపు సొలిసిటర్ జనరల్ మాటలకు సంబంధించింది ఆ ట్వీట్. నిందితునికి ఒక 'లాలిపాప్' ఇస్తే అతడు ఇతరుల గురించి సాక్ష్యం ఇస్తాడు.. ఇదే దర్యాప్తు కళ అన్నారు. కానీ, నిందితునికి 'లాలిపాప్' ఇవ్వడం దర్యాప్తు కళ కిందకు రాదని నేను కామెంట్ చేశాను. దర్యాప్తు బాధ్యత లేదా దమ్ము అనేది ఒక నిందితునికి లాలిపాప్ ఇచ్చి ఇతర నిందితులకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పించడం కానే కాదన్నాను. మీరు ఒక పురావస్తు శాస్త్రవేత్తలా పని చేయాలని సూచించాను. సత్యశోధన కోసం సాక్ష్యాల పొరలను తవ్వి వెలికితీసి పెట్టాలి. వాటి ఆధారంగా ఒక నిర్ధారణకు రావాలని తెలిపాను.

**మన దగ్గర, ముఖ్యంగా సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల విషయంలో పెద్ద సమస్య ఏంటంటే ముందే నిర్ధారణకు రావడం జరుగుతుంది. ఇక దాని చుట్టూ సాక్ష్యాలను అల్లుకుపోతుంటారు. చివరకు రావాల్సిన నిర్ధారణకు ముందే వస్తారు. దాని చుట్టూ సాక్ష్యాలను ఒక స్వెటర్‌లా అల్లుకుంటూపోతారు. ఇలాంటి వైఖరి తీసుకుంటే మీ కేసు దానంతట అదే బలహీనపడుతుంది. ఎందుకంటే మంచి డిఫెన్స్ లాయర్ ఎవరైనా మీ కేసులో కొన్ని లొసుగులను చటుక్కున పట్టుకుంటాడు.**

బెయిల్ రావడం, రాకపోవడం మీద ఆధారపడి కేసు నిలవదు. కేసులో దోషిత్వం నిరూపించిన రోజే దానిలో ఉన్న పస ఎంతో తేలిపోతుంది. అప్పుడే మీరు కేసు గెలుస్తారు. మీరు కేసు ఓడిపోయిన తర్వాత ఈ బెయిలుగియిలు ఏం పనిచేస్తాయి?

సీఎంను, డిప్యూటీ సీఎంను ఏడాదో, ఏడాదిన్నరో ఏదో జైలులో పెడితే ఏమవుతుంది? దీని వల్ల సమాజానికి ఉపయోగం ఏమిటి? ఎవరైనా నేరం చేస్తే మీరు నేర నిరూపణ చేసి చూపెడితే సమాజానికి మేలు జరుగుతుంది. మీ నేరనిరూపణ రేటు మరీ 8 శాతమైతే ఎలా? చట్టాన్ని అమలు చేసే ఏ సంస్థకైనా అరెస్టు చేసి దాని మీద పొదుగుతున్న కోడి గుడ్ల మీద కూర్చున్నట్టుగా కూర్చోమని సమాజం చెప్పదు. జాతక కుండలి గీస్తూ కూర్చోమని పురమాయించదు. మీ బాధ్యత ఏమిటి? నేర నిరూపణ. ఎవరైనా మనీలాండరింగ్‌కు పాల్పడితే ఆరునెలల్లో శిక్ష వేయించి చూపండి. లేదా సంవత్సర కాలంలో వేయించండి. మీ దగ్గర 8 వేల కేసులున్నాయి. ఇప్పటి దాకా 24 కేసుల్లో మాత్రమే విచారణలు జరిగాయి. అటునుంచి కూడినా, ఇటు నుంచి కూడినా.. అన్నీ కలిపితే కేవలం 24, అంతే.

**ఈడీ అయితే ప్రాసిక్యూషనే మొదలుపెట్టదు. సాక్ష్యాలు సమర్పించదు. 'మనిషిని లోపల వేయండి. కేసు పెట్టండి. కానీ, విచారణ మొదలుపెట్టొద్ద'ని పైనుంచి ఆర్డరు వస్తుంది. అసలు విచారణ మొదలుపెడితే డిఫెన్స్ లాయర్ మిమ్మల్ని గుడ్డలిప్పదీసి నిలబెడతాడు. దాంతో కేసు ముగిసిపోతుంది. వాళ్ల దగ్గర గట్టి లాయర్లు లేరని కాదు. వారు పెట్టింది బూటకపు వండి వార్చిన కేసు కావడమే అసలు సమస్య. ఎక్కడో అక్కడ అది చతికిలబడుతుంది.**

బ్రిండ్ కో సేల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అమన్ దీప్‌సింగ్ ఢల్ తరఫున ఈ కేసులో నేను వాదిస్తున్నాను. అతిపెద్ద విదేశీ మద్యం దిగుమతిదారుల్లో ఈ కంపెనీ ఒకటి. నా క్లయింట్‌ను జైలులో పెట్టారు. కానీ, నిజానికి కేసు ఏదీ లేదు. కుట్ర జరిగిందని ఇప్పుడు అందరి చుట్టూ వాళ్లు (దర్యాప్తు సంస్థలు) ఓ కేసు అల్లారు. ఇందులో ఆమ్ ఆద్మీ పార్టీవాళ్లు, సౌత్ గ్రూప్.. అంటే హైదరాబాద్ గ్రూప్, కవిత తదితరులు అందరూ జైలులో ఉన్నారు. ఆమె (కవిత) కూడా రాజకీయ కుటుంబం నుంచి వచ్చారు. శ్రీ అరబిందో ఫార్మా వంటి సంస్థలకు చెందిన కొందరు బిజినెస్ మాగ్నెట్స్ కూడా ఉన్నారు. శరత్‌రెడ్డి మొదట ఈ కేసులో కింగ్‌పిన్ అన్నారు. అప్పుడు నిందితుడు. కానీ, ఈ రోజు ఆయన సాక్షిగా ఉన్నారు. వందకోట్ల ఎలక్టోరల్ బాండ్లు తీసుకున్నారు. అందులో కొంత ముందు, కొంత తర్వాత కొన్నారు. ఈడీ లెక్క ప్రకారమే ప్రధానంగా ముడుపులు చెల్లించిన వ్యక్తే ఇప్పుడు సాక్షిగా మారాడని అంటున్నారు. అంటే తమరు ఇక్కడ ఏం న్యాయం జరిపిస్తున్నారు? ఇది ప్రస్తుతం న్యాయస్థానం ముందున్న కేసు కనుక నేను దీనిపై ఎక్కువగా మాట్లాడితే బాగుండదు. నేను కూడా పాల్గొంటున్నాను కనుక ఎంతోకొంత చెప్తానంతే.

ఇక కేసు వల్ల కేజ్రీవాల్‌కు నష్టం జరిగిందా? అనే విషయాన్ని తీసుకుంటే అరెస్టు చేస్తే ఎంతోకొంత నష్టం ఉంటుంది కదా.. ఇమేజ్ కొంత దెబ్బ తింటుంది కదా. ఢిల్లీలో కేజ్రీవాల్ గురించి ఏమనుకుంటున్నారు అని ప్రజలను అడిగితే.. ఢిల్లీకి ఎంతో కొంత మంచే చేశారని అందరూ చెప్తారు. జనంలో ఈ అభిప్రాయం ఉంది. మళ్లీ సీఎంగా వస్తాడా? అంటే ఎందుకు జరగకూడదనే అంటాను. గెలుస్తాడా, లేదా అనేది కాదు. సెంటిమెంటైతే ఉంది. ఈ కేసులో మాత్రం ఏమీ లేదు. ఈ కేసు గాలిలో వేలాడుతున్నది. నిలుస్తుందా, తేలిపోతుందా అనేది తర్వాత సంగతి. ముందు విచారణ మొదలుపెట్టండి, దమ్ముంటే!

**- ఎడిటోరియల్ డెస్క్**

# సొంత మెజారిటీ లేకున్నా తగ్గని దూకుడు



నాంచారయ్య మెరుగుమాల

పద్దెనిమిదో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ బలం 303 నుంచి 240 సీట్లకు తగ్గిపోవడంతో ఇకపై పాలకపక్షం 'హిందుత్వ దూకుడు' మందగిస్తుందని రాజకీయ పండితులు విశ్లేషించారు. ఇక ప్రతిపక్షాలతో 'సహకార, సర్దుకుపోయే వైఖరిని' అవలంబిస్తుందని దేశంలో ఎందరో ఆశించారు. అయితే, ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు గత రెండున్నర మాసాలుగా తీసుకున్న నిర్ణయాలు, ఉత్తరాది రాష్ర్టాల బీజేపీ ప్రభుత్వాల తాజా విధానాలు పరిశీలిస్తే.. వారు వేసిన అంచనాలు తప్పని స్పష్టమవుతున్నది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రధాని ప్రకటనలను గాని, సర్కారు తీసుకున్న నిర్ణయాలను గాని పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది.

సొంత బలం లేకున్నా బీజేపీ ప్రభుత్వం, కేంద్ర నాయకత్వం ఏకపక్షంగా, 'హిందుత్వపక్షం'గా వ్యవహరిస్తోందనడానికి రెండు ఉదాహరణలు చాలు. దాదాపు 60 ఏండ్లుగా ప్రశాంతంగా సాగుతున్న రెండు వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని మనకు స్పష్టమవుతోంది. ఉత్తరాఖండ్‌లోని గంగా నది నుంచి వేలాది మంది హిందువులు కావడి యాత్ర (కన్వర్ యాత్ర) పేరుతో ఏటా శ్రావణ మాసంలో కొంత మొత్తంలో నీటిని తీసుకుని సొంతూళ్లకు వెదురు కావిళ్లతో బయల్దేరతారు. ఈ యాత్ర మార్గంలో ఉత్తరాఖండ్, యూపీ, మధ్యప్రదేశ్ రాష్ర్టాల్లో రోడ్లకు ఇరువైపులా ఉండే హోటళ్ల యజమానుల పేర్లను ప్రదర్శించాలని ఆయా బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీచేశాయి. మార్గంలో వచ్చే పశ్చిమ యూపీ జిల్లాల్లో ముస్లింల జనాభా ఎక్కువ. అక్కడ హోటళ్ల యజమానుల్లో అత్యధికులు ముస్లింలే. రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వులు రాగానే ఈ హోటళ్ల యజమానులు తమ పేర్లను రాసి బోర్డులు పెట్టారు. ముస్లిం యజమానుల పేర్లు చూసి హిందువులైన కావడి యాత్రికులు ఆ హోటళ్లలో తినకుండా పోవాలనేదే పాలకపక్షం లక్ష్యం. తద్వారా ముస్లిం వ్యాపారులు నష్టపోయి, హిందువులపై ద్వేషం పెంచుకుంటే బీజేపీకి లాభమనేది పాలకుల అంచనా.

ఈ కావడి యాత్ర సమయంలో చాలా వరకు ఈ ఉత్తరాది హోటళ్లలో శాఖాహార భోజనమే విక్రయిస్తారు. ఎన్నో దశాబ్దాలుగా యజమానుల పేర్లున్న బోర్డులు లేకున్నా కావడి యాత్రికులు వాటిలో భోజనం చేస్తున్నప్పుడు.. 2024లో మాత్రం కొత్త నిబంధన అవసరం ఏమొచ్చింది?

అయితే ఈ ఏడాది పార్లమెంటు ఎన్నికల్లో అనేక ఉత్తరాది రాష్ర్టాల్లోని ఓటర్లలో 'హిందువులు, ముస్లింలు' అనే స్పృహ అనుకున్నంత రాలేదు. పూర్వపు మత విద్వేషాలు మరచి, స్థానిక సమస్యల ఆధారంగానే ప్రజలు బీజేపీని ఓడించారు.


**ఈ ఏడాది, వచ్చే సంవత్సరం అనేక పశ్చిమ, ఉత్తరాది రాష్ర్టాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ కారణంగా దేశంలో మతవిద్వేషాలు, ముస్లిం వ్యతిరేకత పెంచే ఎత్తుగడల్లో భాగంగా కావడి యాత్ర సందర్భంగా బీజేపీ ఎన్నడూ లేని అడ్డగోలు ఉత్తర్వులను అమలు చేయాలని చూస్తున్నది. అయితే, ఈ ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించడంతో తాత్కాలికంగా బ్రేక్ పడింది.**

బీజేపీ ప్రభుత్వాల ఉత్తర్వులను ఎన్డీయే భాగస్వాములైన జేడీయూ, ఎల్జేపీ, ఆర్‌ఎల్డీ తప్పుబట్టాయి. కేంద్ర సర్కారు మనుగడ లౌకిక మిత్రపక్షాలపై ఆధారపడి ఉన్నప్పటికీ బీజేపీ తన హిందుత్వ పోకడలను తగ్గించకుండా మరింతగా పెంచడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది.



పార్లమెంట్ ఎన్నికల్లో యూపీలో బీజేపీ ఘోర పరాభవం ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు, మంత్రులతో కూడిన అసమ్మతివర్గానికి మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఈ కీచులాటలు సద్దుమణిగేలా చేయాలని బీజేపీ కేంద్ర నాయకత్వం ఆర్‌ఎస్‌ఎస్‌ను అభ్యర్థించింది. అయితే, బీజేపీ పోకడలపై అనేక విషయాల్లో అభ్యంతరాలున్న ఆర్‌ఎస్‌ఎస్‌కు యూపీ సంక్షోభంలో శాంతిదూతగా పనిచేయడం ఇష్టం లేదు. అందుకే శనివారం జరగాల్సిన సమన్వయ సమావేశాన్ని కూడా ఆర్‌ఎస్‌ఎస్ రద్దు చేసుకుంది. ఈ నేపథ్యంలో సంఘ్ అగ్రనాయకులను శాంతింపచేసే వ్యూహంలో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాల్లో కేంద్ర సిబ్బంది పాల్గొనడానికి మార్గం సుగమం చేస్తూ జూలై 9న బీజేపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగుల ప్రవర్తనను నియంత్రించే నిబంధనలను సవరిస్తూ ఆఫీస్ మెమొరాండం రూపంలో ఉత్తర్వులు విడుదల చేసింది. ఆర్‌ఎస్‌ఎస్‌ను సాంస్కృతిక సంస్థగానే బీజేపీ అభివర్ణిస్తుంది. అందుకే తాజా ఉత్తర్వులు సబబేనని బీజేపీ మంత్రులు వాదిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని నిషేధించడానికి సంబంధించి 1966, 1970, 1980లలో జారీ అయిన ఆఫీస్ మెమొరాండంల నుంచి ఆర్‌ఎస్‌ఎస్ పేరు తొలగిస్తున్నట్టు ఇటీవల కేంద్రం తెలిపింది.

అయితే 'ఈసారి ఎన్నికల్లో బీజేపీకి 400కి మించి సీట్లు ఇవ్వండి' (అబ్ కీ బార్ చార్ సౌ పార్) అనే నినాదంతో 2024 పార్లమెంటు ఎన్నికల ప్రచారం ప్రారంభించిన బీజేపీకి భారత ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారు. నాలుగొందల సీట్లలో కాషాయపక్షాన్ని గెలిపిస్తే ప్రతిపక్షాలు చెబుతున్నట్టు ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ల రద్దు సహా రాజ్యాంగాన్ని ఇష్టమొచ్చినట్టు మోదీ సర్కారు సవరిస్తుందనే భయంతో 240 సీట్లకే దాన్ని పరిమితం చేశారు. లోక్‌సభలో 63 సీట్లు తగ్గిన నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ సర్కారు తన హిందుత్వ దూకుడుకు స్వస్తి పలుకుతుందనే రాజకీయ పండితుల అంచనాలు తప్పని తాజా విధానాల ద్వారా కాషాయపక్షం నిరూపిస్తోంది.




## ప్రభుత్వాన్ని కాపాడే బడ్జెట్!



*'ఎన్నికలు అయిపోయాయి.. ఇప్పుడు మనం దేశం గురించి ఆలోచించాలి' అని మీరే (ప్రధాని మోదీ) అన్నారు. కానీ, కేంద్ర బడ్జెట్‌ను చూస్తే అలా అనిపించడం లేదు. ఆ బడ్జెట్ మీ ప్రభుత్వాన్ని కాపాడుతుంది గాని, దేశాన్ని కాదు. ప్రభుత్వాన్ని నిష్పక్షపాతంగా నడపండి. అంతేగానీ ఇష్టానుసారంగా నడిపితే చివరికి ఒంటరిగా మిగిలిపోతారు.*

**- ఎంకే స్టాలిన్,** తమిళనాడు ముఖ్యమంత్రి